సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 2 । మే । 2024



తమ్ముడిపై హత్యాయత్నం
ఆస్తి వివాదంలో భాగంగా తమ్ముడిపై అన్న, అతడి కుమారుడు కలిసి కత్తితో దాడిచేసి, గాయపరిచిన ఘటన మదనపల్లెలోని ఎస్టేట్ శివాజీనగర్‌లో జరిగింది. -8లో



ఘాట్‌రోడ్డుపై ప్రమాదం
ప్రకృతి అందాలు తిలకించి, అనుభూతితో వెనుదిరిగిన ఓ కుటుంబ ఆనందం క్షణాల్లో ఆవిరైంది. ప్రయాణిస్తున్న కారు బ్రేక్‌లు ఫెయిలై కారు తలకిందులై పడింది. -8లో



అత్తింటివారి దాడి
కాపురం చేసేందుకు అత్తారింటికి వచ్చిన భార్యపై భర్త, అత్తామామలు దాడిచేసి, విచక్షణారహితంగా కొట్టి గాయపరిచిన ఘటన మదనపల్లె మండలంలో జరిగింది. -8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారిత అధికారి శశికళ బుధవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. 2024–2025 సంవత్సానికిగాను ఆదర్శప్రాయమైన పనులు, జాతీయ స్థాయి క్రీడలు, సంఘసేవ, సైన్స్, సైన్స్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలితకళలు, వినూత్నమైన సేవలు అందించిన 5 నుంచి 18 ఏళ్ల లోపు వారు వీటి కోసం దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. అప్లికేషన్లు ఆన్ లైన్ ద్వారా మాత్రమే స్వీకరించనున్నట్లు వివరించారు. https://awards.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

క్రికెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



క్రీడాకారులతో మాట్లాడుతున్న సీఏవైడీ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ఆధ్వర్యంలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని సౌత్‌జోన్ గేమ్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎస్. ఖాజామైనుద్దీన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో సీఏవైడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేసవి శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రికెట్ రాణించేందుకు ఇలాంటి శిబిరాలు దోహదం చేస్తాయన్నారు. క్యాంపు తర్వాత కూడా ప్రొఫెషనల్‌గా రాణించాలనుకునే క్రీడాకారులకు చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. ఏసీఏ ట్రైనర్ జె. ఆనంద్‌కుమార్, ఎస్.మహమ్మద్ ఇలియాస్, సీఏవైడీ కోచ్ అబూబకర్, ఎస్. సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల



సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఈ తదితరులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ 1, 3 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయం వీసీ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వై.పి వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్. ఈశ్వర్ రెడ్డి తో కలిసి తన ఛాంబర్ లో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ ఫలితాలను విశ్లేషిస్తూ ఎంఏ మూడో సెమిస్టర్ తెలుగు, ఇంగ్లీష్, హిస్టరీ, పిఎస్ అండ్ పిఏ, ఎకనామిక్స్, ఉర్దూ, ఎంకామ్, అలానే ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ, బోటనీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ, జెనెటిక్స్, జియాలజీ ఫిజిక్స్ సైకాలజీ, జువాలజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, మైక్రోబయాలజీ సబ్జెక్టుల్లో 100శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎంఏ ఫస్ట్ సెమిస్టర్ తెలుగు, ఇంగ్లీష్, హిస్టరీ, ఎకనామిక్స్, ఉర్దూ, ఎం కామ్ కోర్సులలో 100 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. అలానే ఎమ్మెస్సీ ఫస్ట్ సెమిస్టర్ లో ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఫుడ్ సైన్స్, జియాలజీ, సైకాలజీ ఎంపీఈడీ కోర్సుల్లో 100శాతం ఫలితాలు వచ్చాయన్నారు. సహాయ పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ కె. శ్రీనివాసరావు, డాక్టర్ మమత, చీఫ్ ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో సామాజిక సమస్యలు పరిష్కారం

వేంపల్లె: కృత్రిమ మేధస్సుతో సామాజిక సమస్యలు ఎదుర్కొగలిగే అపారమైన సామర్థ్యం ఉందని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ వైస్ చాన్సలర్ విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం ఇడుపులపాయలోని ఆర్‌కెవ్యాలీ ట్రిబుల్ ఐటీలో కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండవ విడత కోణం ఫెలోషిప్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఇడుపులపాయ ట్రిబుల్‌ఐటీకి చెందిన పూర్వ విద్యార్థి సందీప్ కోణం నెలకొల్పి నిర్వహిస్తున్న కోణం ఫౌండేషన్ సంస్థ ఫెలోషిప్ రూపకల్పనలను వైస్ ఛాన్సలర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం నమూనా వరకు మాత్రమే పరిమితం కాకుండా అమలు చేయగల పరిష్కారాల ప్రాజెక్టుల పట్ల వారి అంకిత భావాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కే వ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రాంభూపాల్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మహమ్మద్ రఫీ, కోణం ఫౌండేషన్ ప్రతినిధి సమరసింహారెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ పాపం బాబుదే!

వానొచ్చినా..వరదొచ్చినా..ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా ఠంఛన్‌గా ఒకటొవ తేదీనే అత్యధిక శాతం మంది పింఛన్ సొమ్మును పొందే వారు. అందుకు కారణం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉన్న వలంటీర్‌లే. టీడీపీ నేత చంద్రబాబు అండ్ కో కుటిల రాజకీయాల కారణంగా వలంటీర్‌లు విధులకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆ ప్రభావం పింఛన్లపై..తద్వారా పండుటాకులపై పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- నిన్న సచివాలయాలు.. నేడు బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు
- పెన్షన్ కోసం వచ్చి రాయచోటిలో ఒకరు మృత్యువాత
- జిల్లాలో 59658 మందికి రూ.17.17 కోట్లు మంజూరు

బ్యాంక్‌కు వెళ్లి పెన్షన్‌ను తీసుకోలేకపోతున్నా



గాలివీటి గంగులమ్మ

గాలివీడు మండలంలోని గుండ్లచెరువు గ్రామానికి చెందిన ఈమె పేరు గాలివీటి గంగులమ్మ. 80 ఏళ్లు. కాళ్లు, చేతులు వాపులొచ్చాయి. పింఛన్ గురించి ఆరా తీయగా.. బ్యాంక్‌కు వెళ్లి పెన్షను తీసుకోమని అధికారులు చెబుతున్నారు. ఈ సమయంలో ఎండలు ఎక్కువున్నాయి.. ఎలా పోయేది అని నిట్టూర్చింది. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటికి వచ్చి పెన్షన్‌ను అందించేవారు. ఎన్నికలని చంద్రబాబు నాయుడు ముసలివాండ్లపై నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మాలాంటి వృద్ధులకు చంద్రబాబు నాయుడు రూ.4వేలు పెన్షన్ ఇస్తానంటే ఎలా నమ్మగలమని ప్రశ్నిస్తోంది.

రాయచోటి : నెల మొదటి తారీఖు వచ్చింది కానీ పెన్షన్ మాత్రం రాలేదు. వలంటీర్లు రాలేదు.. పింఛన్లు ఇవ్వలేదు. ఇది ప్రస్తుతం జిల్లాలో పింఛన్‌దారుల పరిస్థితి. ఒకవేళ పెన్షన్ తీసుకోవాలనుకుంటే బ్యాంకులకు వెళ్లి పడిగాపులు కాయాలట. దీంతో మండుటెండల్లో ఎలా వెళ్లాలోనని వృద్ధులు, దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకు సెలవు అనే విషయం తెలియక లక్కిరెడ్డిపల్లె మండలం కాకులవరం గ్రామానికి చెందిన ఎం.సుబ్బన్న మంగళవారం మండుటెండను భరిస్తూ బ్యాంకు దగ్గరికి వెళ్లారు. తీరా బ్యాంకు లేకపోగా వెంటాడిన వేడి ఆయన ప్రాణాలను తీసింది. ఈ సంఘటనను చూసిన స్థానికులు చంద్రబాబు వక్రబుద్ధిపై మండిపడుతున్నారు. ప్రతిపక్ష టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన కుట్రల వల్ల వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ వాపోయారు. వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయడంపై టీడీపీ ఈసీకి ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలోనే టీడీపీకి అనుకూలంగా పనిచేస్తున్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ ఆధ్వర్యంలోని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంస్థ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. ఈ పిటీషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈసీకి ఆదేశాలు ఇచ్చిందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈసీ ఆదేశాల నేపథ్యంలో గత నెల పింఛన్ పంపిణీలో అవాంతరాలు ఏర్పడ్డాయి. సచివాలయాల వద్ద అధికారులు పెన్షన్లు పంపిణీ చేయగా.. వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే ఎండల తీవ్రతతో వడదెబ్బకు పలు ప్రాంతాలలో వృద్ధులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో చంద్రబాబు వల్లే తమకు ఈ దుస్థితి వచ్చిందంటూ పింఛన్‌దారులు వాపోతున్నారు. ఇప్పుడేమో బ్యాంకులకు వెళ్లి డబ్బులు తెచ్చుకోవడమంటే సాధ్యపడుతుందా? అని ఆలోచనలో పడ్డారు.

చంద్రబాబు కుట్ర

చంద్రబాబు చేసిన కుట్ర వల్లే తమకు ఇబ్బందులని పెన్షన్‌దారులు తీవ్రంగా మండిపడుతున్నారు. వలంటీర్లు నిస్వార్థంగా ప్రతి ఇంటి గడప ముందుకు వచ్చి పెన్షన్లు అందించేవారని చెబుతున్నారు. ప్రజల్లో సీఎం వైఎస్ జగన్‌కు మంచిపేరు వస్తుండటంతో ఓర్వలేకే ఈ విధంగా విపక్షాలు చేస్తున్నాయని ప్రజలు ధ్వజమెత్తుతున్నారు. గతంలోనూ వైఎస్ జగన్ అందించే ఎన్నో సంక్షేమ పథకాలను చంద్రబాబు అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శిస్తున్నారు. పేదలకు మంచి జరుగుతుంటే ఆయన చూసి తట్టుకోలేకపోతున్నారని మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతామని అంటున్నారు. ఈ రెండు నెలల పాటు తమను ఇబ్బంది పెట్టినప్పటికీ వలంటీర్లతో పాటు ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ వైపే ఉన్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాకు 59,658 మంది రూ.17.17 కోట్లు

అన్నమయ్య జిల్లా పరిధిలోని 30 మండలాల పరిధిలో 59,658 మందికి రూ.17,17,24,000 ప్రభుత్వం మంజూరు చేసింది. వీరిలో బ్యాంకు ఖాతాలో ఉన్న 80 శాతం మందికి నేరుగా ప్రభుత్వం వారి ఖాతాల్లో పెన్షన్ డబ్బులను జమ చేసింది. బ్యాంకు ఖాతాలు లేని వారికి సచివాలయ ఉద్యోగులు మంగళవారం అక్కడక్కడ వారి ఇంట్లో వెళ్లి పెన్షన్ డబ్బులను అందజేశారు. బుధవారం మేడే కారణంగా బ్యాంకులు లేకపోవడంతో పెన్షన్‌దారులు తమ డబ్బులు కోసం మరో రోజు కోసం వేచి ఉండాల్సి వచ్చింది. ముందే భగభగ మండుతున్న ఎండలకు తట్టుకుని సుదూర ప్రాంతాలలో ఉన్న బ్యాంకులకు ఎలా వెళ్లాలో దిక్కు తోచని స్థితిలో పెన్షన్‌దారులు దిక్కులు చూస్తున్నారు. కాగా తొలి రోజు బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన .. ఇంటిదగ్గరికెళ్లి ఇచ్చినవారి సంఖ్య 76.02 శాతంగా నమోదైంది. మిగతావారికి గురువారం ఇవ్వనున్నారు.

మాబోటోళ్ల ఉసురు తగలకమానదు



నాపేరు కృష్ణమ్మ. మాది రాజంపేట. పోయిన నెల కాక అంతముందు నెల వరకు వలంటీర్లు ఇంటికి వచ్చి మాకు ఇబ్బంది లేకుండా పింఛన్ ఇచ్చేవాళ్లు. పోయిన నెల నుంచి టీడీపోళ్లు వలంటీర్లతో డబ్బు ఈయనీకుండా సేసినారు. పోయిన నెల ఎట్లోకట్ల సచివాలయం కాడికి పోయి పింఛన్ తెచ్చుకున్నా. ఈనెల సచివాలయం కాడ కూడా ఈయనీకుండా సేసినారు. ఇప్పుడు నా పింఛన్ బ్యాంకులో వేసినారంట. నాకు సదువు రాదు. బ్యాంకుకు పోయి కాయితం రాయిచ్చి డబ్బు తెచ్చుకోవాలంటే అయ్యేపనేనా. నాయకులు జగన్‌లాగా పెజలకు ఏదైనా మంచి సేయాలి కాని, ఇట్ల కట్టాలు పెట్టే పనులు చేస్తే నాబోటోళ్ల ఉసురు తగలక పోదు. – ఎం.కృష్ణమ్మ, రాజంపేట

ఏ బ్యాంక్‌కు వెళ్లాలో తెలియని దుస్థితి



ఏ బ్యాంక్‌కు వెళ్లాలో తెలియని దుస్థితి మాది. వయస్సు అయిపోయినోళ్లం ఏడికిపోవాలి. కన్ను ఆపరేషను చేసుకున్నాను. ఎండకు ఆటోలో పోతే చార్జీలు తడిసిమోపడవుతాయి. చంద్రబాబునాయుడు చేసిన పనికి ఈ వయస్సులో ఫించన్ కోసం ఇబ్బందులు పెట్టే పనిచేశాడు. ఆయనకో దణ్ణం నాయన. ఇలాంటోడు సీఎంను చేస్తే మా బతుకులు తెల్లారినట్లే. –సుబ్బులక్షమ్మ, నాగిరెడ్డిపల్లె అర్బన్, నందలూరు

పెన్షన్ డబ్బుల కోసం...



వృద్ధాప్య పెన్షన్ డబ్బులు ఎక్కడ తీసుకోవాలో తెలీక చాలా ఇబ్బందులు పడుతున్నాను. ఈనెల పెన్షన్ డబ్బులు తీసుకునేందుకు సిద్దవటం గ్రామ సచివాలయానికి వెళ్లాను. అక్కడికి పోతే నీడబ్బులు బ్యాంకులో పడ్డాయన్నారు. బ్యాంకు వద్దకు వస్తే బ్యాంకు మూసేశారు. వృద్ధులను ఎండలకు ఇబ్బంది పెడుతున్న చంద్రబాబు నాయుడు ఇంతకు ఇంత అనుభవించక తప్పదు. –పెంచలయ్య, గాంధీవీధి, సిద్దవటం

ఎంప్లాయిమెంట్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోండి

రాయచోటి టౌన్ : ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలోని నిరుద్యోగ యువత ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 10వ తరగతి నుంచి ఉన్నత విద్య వరకు ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ ఎంప్లాయిమెంట్ పోర్టల్‌ను సద్వినియోగం చేఉకోవచ్చున్నారు. అందు కోసం ప్రభుత్వం వెబ్‌సైట్ ఉంచిన్నారు. https://www.employment. ap. gov.inలో ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, మెయిల్ ఐడి, ద్వారా లాగిన్ అయ్యి పూర్తి వివరాలను మీ ఇంటి నుంచే మీ మొబైల్‌లోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. 2023–2024 సంవత్సరం విద్యాసంవత్సరం నుంచి 10వ తరగతి, ఇంటర్ డిగ్రీ పాస్ అయిన వారు చేసుకోవచ్చుని సూచించారు.

‘లెక్క’ పక్కాగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల హడావుడి కొనసాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. అభ్యర్థులు ఎన్నికల్లో రోజువారి చేసే ఖర్చులకు లెక్క పక్కాగా ఉండాలని ఎన్నికల సంఘం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో అభ్యర్థులు ప్రతిరోజు చేసిన ఖర్చు వివరాలను ఎన్నికల సంఘానికి తెలియజేయాల్సి ఉంటుంది. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి రూ. 90 లక్షలకు మించి ఖర్చు చేయరాదని స్పష్టం చేశారు. ఒకవేళ అదనంగా ఖర్చు చేస్తే ఎన్నికల సంఘం వేటు వేసే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల్లో చేసే రోజువారి ఖర్చుల వివరాలపై ఎన్నికల పరిశీలకులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గత నెల 18 నుంచి ఎన్నికల నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి ఎన్నికలు ముగింపు వరకు ఎన్నికల కోసం ఖర్చు చేసే వివరాలను రోజువారీగా లెక్క చెప్పాల్సి ఉంటుంది.

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

రాయచోటి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫిరెన్సు హాల్‌లో ఎన్నికల సమర్థవంత నిర్వహణపై నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ మే 13న జరిగే సాధారణ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేసి పోలింగ్ సరళిని విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల వివరాలు ఓటర్ల సంఖ్య తదితర సమాచారం ఎన్నికల అబ్జర్వర్లకు ఇవ్వాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ ఎన్నికలలో ఎటువంటి సమస్యలు తలెత్తినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో ముఖ్యంగా కో-ఆర్డినేషన్ సెక్షన్, అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ చాలా అలర్ట్‌గా ఉండాలన్నారు. జిల్లాలో ఓటర్ గుర్తింపు కార్డులు పంపిణీ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించి ప్రతి ఒక్కరికీ పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలన్నారు. హోమ్ ఓటింగ్ కార్యక్రమంలో ఎటువంటి సమస్యలు లేకుండా అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఈవీఎం స్ట్రాంగ్ రూములు దగ్గర విద్యుత్ సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఈవీఎంఎస్ వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ తప్పకుండా ఉండేటట్లు చూడాలన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి....

ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ ఎంసీసీ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది 24/7 గంటల విధులు నిర్వహించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. చెక్‌పోస్టులలో సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా ఆత్మీయత



సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి రెడ్డి ప్రచారానికి అడుగడుగునా జనం నీరాజనం పలుకుతున్నారు. దిష్టి తీస్తూ కొందరు.. హారతి ఇస్తూ మరికొందరు తమ ప్రేమను చాటుకుంటున్నారు. ‘ఎండనబడి వచ్చావ్.. ఇదిగో తల్లీ ’ అంటూ చల్లని పానీయాలు ఇచ్చి ఆమెపై తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.బుధవారం వైఎస్ భారతి సింహాద్రిపురం మండలం రావులకొలను పంచాయతీలో ప్రచారం చేశారు. – సింహాద్రిపురం

జోరుగా... హుషారుగా..

- అన్నమయ్య జిల్లాలో ఊపందుకున్న వైఎస్సార్ సీపీ ప్రచారం
- ఎక్కడికక్కడ నేతల చేరికలతో పార్టీలో జోష్
- నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో ప్రచారంపై దృష్టి
- మరోవైపు కూటమి నేతలు నియోజకవర్గాల్లో ప్రచారం
- నేడు రాయచోటికి రానున్న టీడీపీ అధినేత చంద్రబాబు



కలికిరిలో సీఎం వైఎస్ జగన్ ప్రచారం (ఫైల్)

సాక్షి రాయచోటి: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడ చూసినా రాజకీయ సందడి కనిపిస్తోంది. మరోవైపు పార్టీ అధినేతల పర్యటనలతో కార్యకర్తల్లో వేడిపుడుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి పార్టీలు అభ్యర్థుల కసరత్తు పూర్తి చేసిన వెంటనే ప్రచారానికి తెర లేపారు. ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార పర్వం జోరుగా హుషారుగా కొనసాగుతోంది.

సిద్ధం సభలతో శ్రేణుల్లో జోష్

సార్వత్రిక ఎన్నికల తరుణంలో వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణుల్లో ఎప్పటికప్పుడు ఉత్సాహం నింపుతున్నారు. ఇప్పటికే సిద్ధం, మేమంతా సిద్ధం బస్సు యాత్రతో కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతనెల మొదటి వారంలో మదనపల్లెలో నిర్వహించిన సిద్ధం సభతోపాటు ములకల చెరువు నుంచి మదనపల్లె వరకు బస్సు యాత్రలో పాల్గొన్నారు. అంతేకాకుండా ఏప్రిల్ 30న పీలేరు నియోజకవర్గంలోని కలికిరి బహిరంగసభలో పాల్గొని శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేశారు. వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుండి నడిపిస్తున్నారు.

వైఎస్సార్ సీపీలో నేతల చేరికతో జోష్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో టీడీపీ కీలక నేతల చేరికతో జోష్ పెరిగింది. ఎక్కడికక్కడ అటు ఉమ్మడి వైఎస్సార్ కడపజిల్లాలో అనేక మంది నేతలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఇంకోవైపు అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయచోటి టీడీపీ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటుకు సంబంధించి టీడీపీ ఇన్‌ఛార్జిగా కొనసాగిన గంటా నరహరితోపాటు ఇంకా అనేక మంది నేతలు పార్టీలో చేరారు. దీంతో పార్టీలో నేతల రాకతో ఎక్కడ చూసినా కొత్త ఉత్సాహంతో కార్యకర్తలు ఎన్నికల వైపు పరుగులు తీస్తున్నారు.

నేడు రాయచోటికి చంద్రబాబు

రాష్ట్ర వ్యాప్తంగా కూటమి అభ్యర్థులకు మద్దతుగా టీడీపీ నిర్వహిస్తున్న ప్రజాగళం సభల్లో భాగంగా గురువారం రాయచోటిలో బహిరంగసభ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో రాయచోటిలోని నేతాజీ సర్కిల్‌లో బహిరంగసభకు ఏర్పాట్లు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఈ సభకు హాజరై ప్రసంగించనున్నారు.

కూటమిలో లుకలుకలు

జిల్లాలో కూటమి నేతల ప్రచారం కంటే లుకలుకలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. రాజంపేట ఎంపీ స్థానం బీజేపీకి కేటాయించగా, రైల్వేకోడూరు అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. నామినేషన్ల అనంతరం ఆయా కూటమి అభ్యర్థులతోపాటు కుటుంబ సభ్యులు కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో కూటమిలో కుతంత్రాలు, కుట్రలు జరుగుతున్నా పైకి మాత్రం తమ అభ్యర్థులను గెలిపించాలంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు వారం రోజుల కిందట రాజంపేటకు వచ్చి ప్రజాగళం సభలో పాల్గొని కూటమి విజయానికి కృషి చేయాలని కార్యకర్తలను దిశా నిర్దేశం చేశారు.

మాకు అవినీతి చరిత్రే లేదు!

- ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యేగా నాపైనా ఒక్క అవినీతి ఆరోపణ చూపించు
- రాష్ట్రాన్ని చీల్చిన కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయమని నిస్సిగ్గుగా అడుగుతున్నావ్
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిత్వం ఏమిటో జిల్లా ప్రజలకు తెలుసు
- స్వార్థపరులకంటే సామాన్యుల దీవెనలే వైఎస్ కుటుంబానికి అండ
- పీసీసీ అధ్యక్షురాలిపై మండిపడ్డ బద్వేల్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధా



ఎమ్మెల్యే డాక్టర్ సుధా

సాక్షి ప్రతినిధి, కడప: ‘పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మిడిమిడి జ్ఞానంతో వ్యవహరిస్తోన్నారు.. ఎమ్మెల్సీ గోవిందరెడ్డిపై, నాపై అవినీతి చరిత్రే అంటే జనం నవ్విపోతున్నారు. మీకు చేతనైతే మాపై అవినీతి ఆరోపణలు చూపించాలని’ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధ సవాల్ చేశారు. బద్వేల్‌లో షర్మిళ ప్రసంగంపై ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సుధా బుధవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎలాంటి వ్యక్తిత్వం ఉన్నవారో జిల్లా ప్రజలకు ఎరుకేనన్నారు. 10ఏళ్లు కడప ఎంపీగా పార్లమెంటులో జిల్లా కోసం నినదించారు. స్టీల్ ప్లాంట్ కోసం అనేక పర్యాయాలు పోరాటం చేశారు. పార్లమెంటు రికార్డులు పరిశీలిస్తే ఆ విషయం తేటతెల్లమౌతోంది. ఎక్కడో ఉన్న షర్మిలకు ఈవిషయం తెలియకపోవచ్చున్నారు. వివేకానందరెడ్డి హత్యలో ప్రత్యక్షంగా పాల్గొని నరికి చంపామని, చెబుతోన్న డ్రైవర్ దస్తగిరి అండగా ఉండేది ఎవరు? మీకు ఆ విషయం తెలియదనుకోవాలా? మీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డగోలు ఆరోపణలకు పరిమితమయ్యారని మండిపడ్డారు.

రాష్ట్రాన్ని చీల్చిన కాంగ్రెస్‌కు ఓటేయ్యాలా?

ఆంధ్రరాష్ట్ర ప్రజల ఆవేదన, ఆందోళనను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా రెండు ముక్కలుగా రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ పార్టీకి ఓటేయ్యాలా? అంటూ ఆమె ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నిస్సిగ్గుగా అభ్యర్థిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధా ధ్వజమెత్తారు. కనీసం విభజిత రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలన్న ఆలోచన లేకుండా విభజించారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలి హోదాలో తెలుగు ప్రజలు రాష్ట్రంలో మిమ్మల్ని తిరగనివ్వడమే పాపమని మండిపడ్డారు. మీలాంటి స్వార్థపరుల కంటే సామాన్యుల దీవెనలు పుష్కలంగా వైఎస్ కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నాయని తెలిపారు. కోట్లాది మంది ఆడపడుచులకు అండగా జగనన్న నిలిచారన్న వాస్తవాన్ని గ్రహించాలని హితవు పలికారు. శత్రువులతో చేతులు కలిపి పుట్టింటి భవిష్యత్‌ను నాశనం చేయాలని చూస్తున్న మీకు కడప పార్లమెంటు ఓటర్లు తగిన బుద్ధి చెప్పేందుకు సంసిద్ధులై ఉన్నారని ఆమె వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల్ని నమ్ముకున్న నాయకుడు. మీలాంటి స్వార్థపరులను నమ్ముకోలేదు. ప్రజలే ఆయనకు దేవుళ్లు. వారి అండదండలు ఉన్నన్నాళ్లు మీలాంటి వారి ఆరోపణలు గాలికి కొట్టుకుపోవడం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ సుధా స్పష్టం చేశారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


మృతి చెందిన మంజులమ్మ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కాట్నగల్లు పంచాయతీ దూలంవారిపల్లిలో బుధవారం మంజులమ్మ (48) అనే మహిళ ప్రమాదవశాత్తు ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అయితే మృతి చెందిన మహిళ బయట రాష్ట్రం నుంచి చుట్టపు చూపుగా ఇక్కడకు బంధువుల ఇంటికి వచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

మామిడి తోట దగ్ధం


షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన మామిడితోటలోని మోటారు

చిట్వేలి : నాగవరం పంచాయతీ దేవరాయపల్లి అరుంధతివాడకు చెందిన బొమ్మవరం యానాదయ్య మామిడితోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైంది. నాగవరం రెవెన్యూ గ్రామ పొలంలో సర్వే నంబరు. 1109/2లో 2.69 ఎకరాల భూమిలో 25 ఏళ్ల క్రితం మామిడి చెట్లు నాటారు. ఈ తోటలలో సకాలంలో దుక్కి దున్నకపోవడం, గడ్డి ఎక్కువగా ఉండటంతో మోటారు షార్ట్ సర్క్యూట్ వలన గడ్డి అంటుకొని మామిడి చెట్లు కాలిపోయాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. సమాచారం తెలుసుకున్న ఆర్ఐ శేషంరాజు, వీఆర్‌ఓ సుబ్బరాయుడు బుధవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వడదెబ్బతో 10 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

గాలివీడు : మండల పరిధిలోని గరుగుపల్లె గ్రామం ఎడపనుచేనుపల్లెలో కానల సిద్దారెడ్డికు చెందిన గొర్రెలు వడదెబ్బతో మృతి చెందాయి. సిద్దారెడ్డి గత కొన్ని సంవత్సరాల నుంచి గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో రోజువారిగా గొర్రెలను పంట పొలాలలో మేత కోసం తీసుకెళ్లాడు. ఎండ తీవ్రతతో వడ్డ దెబ్బకు గురై 10 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు తెలిపారు. పశువైద్యాధికారికి సమాచారం అందించారు. వీటి విలువ సుమారు రూ.80వేలు వరకు ఉంటుందని రైతు తెలిపాడు.

హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై తలకిందులైన కారు

- సురక్షితంగా బయటపడిన కర్ణాటక వాసి కుటుంబం
- బ్రేక్ ఫెయిల్‌తో ప్రమాదం



ఘాట్‌రోడ్డులో తలకిందులైన కారు, సురక్షితంగా బయటపడిన శ్రీనివాసులురెడ్డి, కుటుంబ సభ్యులు

బి.కొత్తకోట : ప్రకృతి అందాలు తిలకించి, చల్లటి వాతావరణం అనుభూతితో వెనుదిరిగిన ఓ కుటుంబ ఆనందం క్షణాల్లో ఆవిరైంది. ప్రయాణిస్తున్న కారు బ్రేకులు ఫెయిల్ కావడంతో లోయలోకి పడకుండా చేసిన ప్రయత్నాల్లో కారు తలకిందులై పడింది. అందులోని ముగ్గురు సురక్షితంగా బయటపడగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా..

బి.కొత్తకోటకు 18 కిలోమీటర్ల దూరంలోని కర్ణాటకలోని గౌనిపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి, రజిత భార్యాభర్తలు. వేసవి సెలవులు కావడంతో విహార యాత్రకు వెళ్లేందుకు వీరి కుమార్తె, కుమారుడు ఆరవ తరగతి చదువుతున్న గగన, ఒకటవ తరగతి చదువుతున్న సుజిత్‌రెడ్డిలతో కలిసి బుధవారం ఉదయం కారులో మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ వచ్చారు. కొండపై ప్రకృతి అందాలను తిలకించి చల్లటి వాతావరణంలో సేదతీరారు. కొన్ని గంటల తర్వాత తిరుగు ప్రయాణం అయ్యేందుకు వెనుదిరిగారు. కొండపై నుంచి కిందకు వస్తుండగా రేణిమాను మలుపు ముందున్న మలుపు వద్దకు రాగానే డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసులురెడ్డి కారు బ్రేకులు ఫెయిల్ అయినట్టు గుర్తించారు. ఎడమవైపు లోయలు ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశాలు గుర్తించి కారును కుడివైపు తిప్పారు. అప్పటికే చేతి బ్రేక్‌ను వేసి కారును నిలిపే ప్రయత్నం చేశారు. అయినా సాధ్యం కాలేదు. దీంతో కారును కుడివైపునకు మళ్లించి కొండను ఢీకొని నిలిపేలా ప్రయత్నించారు. అయితే కొండబండను ఢీకొన్న కారు ఒక్కసారిగా రోడ్డుపై తలకిందులుగా పడిపోయింది. ఇంజిన్ నుంచి పొగలు రావడంతో అగ్నికి ఆహుతి అయ్యేలా ఉందని ఆందోళనకు గురైన శ్రీనివాసులురెడ్డి కారులోంచి బయటకు వచ్చేందుకు డోర్లు తెరచుకునే పరిస్థితి లేదని గుర్తించారు. దీంతో కుడికాలితో బలంగా తన్ని అద్దాలను పగులగొట్టారు. తర్వాత భార్య, పిల్లలు కారులోంచి బయటపడ్డారు. అద్దాలను తన్నడంతో శ్రీనివాసులురెడ్డి కుడి పాదానికి తీవ్ర గాయంతో తీవ్ర రక్తస్రావమైంది. ఈ ప్రమాద ఘటనను గుర్తించి స్థానికులు బాధితులకు సహాయక చర్యలు చేపట్టారు. పాదానికి అయిన గాయానికి బ్యాండేజి కట్టి కారులో బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించారు. కాగా ప్రమాద సమయంలో కారులోనే ఉన్న భార్య రజిత, పిల్లలు గగన, సుజిత్‌రెడ్డిలకు ఎలాంటి గాయాలు కాలేదు. అదృష్టవశాత్తు కారు ఎడమవైపు వెళ్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేదంటే కారు 30 అడుగుల పైనుంచి కిందకు పడి ఉండేది.

టీడీపీ ప్రచారంలో ఆలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి


పార్టీ కండువా కప్పుకొని వరుసలో నిల్చున్న వెంకటసాయి కుమార్

రాయచోటి టౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ఔట్ సోర్సింగ్ వాచ్‌మన్‌గా పని చేస్తున్న వెంకటసాయి కుమార్ టీడీపీ అభ్యర్థితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాడు. ఈ విషయమై ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డిని వివరణ కోరగా ఆయన తమ ఉద్యోగి కాదని ఔట్ సోర్సింగ్ ద్వారా పని చేస్తున్నాడన్నారు. విషయం తెలుసుకొని పై అధికారులకు, ఆ సంస్థ యజమానులకు సమాచారం ఇచ్చానని తెలిపారు. ఆ రోజు నుంచి అతను విధులకు రాలేదన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దమండ్యం : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ ఇషాక్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాపేపల్లె పంచాయతీ పెద్దతురకపల్లెకు చెందిన శివపురం హిసాన్‌బాషా కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. గత నెల 29న రాత్రి పల్లెకు సమీపంలోని పొలాల్లో పురుగుల మందు తాగి పడి ఉండగా గుర్తించి కుటుంబ సభ్యులు రాయచోటిలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కడపకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు మృతుని భార్య షాను ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

వివాహితపై అత్తింటివారి దాడి

- విచక్షణారహితంగా రోడ్డుపైనే చితకబాదిన భర్త
- గాయాలతో ఆస్పత్రిలో చేరిన బాధితులు


కోడలిపై దాడిచేస్తున్న అత్తమామలు

మదనపల్లె : కాపురం చేసేందుకు అత్తారింటికి వచ్చిన భార్యపై భర్త, అత్తామామలు దాడిచేసి, విచక్షణారహితంగా కొట్టి గాయపరిచిన ఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. తట్టివారిపల్లె పంచాయతీ దేవతానగర్‌లో నివాసం ఉంటున్న రెడ్డెప్ప, రామలక్ష్మమ్మల కుమారుడు ఎం.నరసింహులు(34)కు సోమల మండలం పెద్ద ఉప్పరపల్లెకు చెందిన స్వప్న(28)తో వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. భర్తతో విభేదాల కారణంగా స్వప్న ఆరునెలలుగా పుట్టినింటిలోనే ఉంటోంది. ఈ క్రమంలో భర్త నరసింహులు, మౌనిక అనే వేరొక అమ్మాయిని ఇంట్లో తెచ్చి పెట్టుకున్నాడని తెలియడంతో, కాపురం నిలబెట్టుకునే ఉద్దేశంతో తల్లి శకుంతల, అన్న మురళితో కలిసి బుధవారం భర్త నరసింహులు ఇంటికి వెళ్లింది. కోడలు స్వప్నను ఇంటిలోకి రానివ్వకుండా, గుమ్మంలోనే మామ రెడ్డెప్ప, అత్త రామలక్షుమ్మలు అడ్డుకున్నారు. ఇన్నాళ్లకు మొగుడు గుర్తుకు వచ్చాడా... ఇంట్లోకి రానవసరం లేదంటూ బయటకు నెట్టేందుకు ప్రయత్నించారు. తన భర్త ఇంటిలోకి రావద్దని చెప్పడానికి మీరెవరని, స్వప్న మొండిగా లోనికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో అత్తమామలు, కోడలిపై దాడికి పాల్పడ్డారు. కుమార్తెను అత్తామామలు విచక్షణారహితంగా కొడుతుండటంతో అడ్డుకునేందుకు వెళ్లిన తల్లి శకుంతలను సైతం వారు కాలితో తన్ని గెంటేయడంతో ఇద్దరూ కిందపడ్డారు. ఈలోపు అక్కడకు చేరుకున్న భర్త నరసింహులు చెప్పా పెట్టకుండా ఇంటికి వచ్చేందుకు నీకెంత ధైర్యమంటూ రోడ్డుమీద అందరూ చూస్తుండగానే, కాలితో తన్నుతూ, కొడుతూ వీరంగం సృష్టించాడు. భార్య, అత్తను తీవ్రంగా గాయపరిచాడు. దీంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించి, చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి వెళ్లారు. తల్లి శకుంతలకు కడుపునకు శస్త్రచికిత్స జరిగిన ప్రదేశంలో బలంగా కాలితో తన్నడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు.

ఆస్తివివాదంలో..తమ్ముడిపై అన్న హత్యాయత్నం

పరిస్థితి విషమం



మదనపల్లె : ఆస్తి వివాదంలో భాగంగా పట్టపగలే నడిరోడ్డు మీద తమ్ముడిపై అన్న, అతడి కుమారుడు కలిసి కత్తితో దాడిచేసి, తీవ్రంగా గాయపరిచిన ఘటన బుధవారం పట్టణంలోని ఎస్టేట్ శివాజీనగర్‌లో జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న ఎస్.శ్రీనివాసులురెడ్డి(47) రియల్‌ఎస్టేట్ వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం క్రితం తట్టివారిపల్లె క్రాస్‌లో 16 సెంట్ల స్థలం కొని అన్న వెంకటరమణారెడ్డి పేరు మీద రిజిస్టర్ చేయించాడు. అదే స్థలం రోడ్డు నిర్మాణంలో భాగంగా నాలుగు సెంట్లు ప్రభుత్వం తీసుకుని నష్టపరిహారం చెల్లించింది. దీంతో మిగిలిన స్థలం, పరిహారం విషయమై అన్నదమ్ముల మధ్య కొంతకాలంగా విభేదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అన్న వెంకటరమణారెడ్డి(60), కుమారుడు మనోజ్‌రెడ్డి(32)తో కలిసి శివాజీనగర్‌లోని శ్రీనివాసులురెడ్డి ఇంటికి వెళ్లి గొడవ పడ్డారు. గొడవలో భాగంగా శ్రీనివాసులురెడ్డిని వీధిలోకి లాగి, వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా దాడిచేసి, తీవ్రంగా గాయపరిచారు. ఎడమఛాతీ, వీపుపై కత్తితో తీవ్రంగా పొడవడంతో రోడ్డు మొత్తం రక్తసిక్తమైంది. పెద్దసంఖ్యలో ప్రజలు గుమికూడారు. కత్తిపోట్లకు గురైన శ్రీనివాసులురెడ్డి అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగం వైద్యులు చికిత్స అందించినప్పటికీ శ్రీనివాసులురెడ్డి ఛాతీపై నుంచి రక్తస్రావం ఆగకపోవడంతో పరిస్థితి విషమంగా మారింది. దీంతో స్థానిక వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేయగా, కుటుంబ సభ్యులు ప్రైవేట్ అంబులెన్స్‌లో వేలూరు సీఎంసీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు.

అత్తపై అల్లుడి దాడి

మదనపల్లె : కూతురిని కొట్టవద్దని వారించిన అత్తపై అల్లుడు దాడిచేసిన ఘటన బుధవారం పట్టణంలో జరిగింది. నక్కలదిన్నెకు చెందిన బాణావత్ రమణమ్మ(40) తన కుమార్తె తులసిని స్థానికంగా ఉన్న బాబూనాయక్‌కు ఇచ్చి వివాహం జరిపించింది. మద్యానికి బానిసైన బాబూనాయక్ తరచూ భార్య తులసిపై దాడికి పాల్పడేవాడు. ఈ క్రమంలో బుధవారం తల్లి రమణమ్మ ఇంటివద్ద ఉన్న భార్య తులసిపై మద్యం మత్తులో దాడికి పాల్పడ్డాడు. కుమార్తెను విచక్షణారహితంగా కొడుతుండటంతో అత్త రమణమ్మ అడ్డుకుంది. దీంతో ఆగ్రహించిన బాబూనాయక్ ఆమెపై దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు బాధితురాలిని 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తల అత్యుత్సాహం

మల్బరీ షెడ్డుకు మంటలు

ములకలచెరువు : టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి ప్రచారంలో కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇళ్ల మధ్యలో బాణసంచా కాల్చడంతో పక్కనే ఉన్న మల్బరీ షెడ్‌కు మంటలు అంటుకున్నాయి. వివరాలు ఇలా .. మండలంలోని దేవలచెరువు పంచాయతీ గొల్లవారిపల్లెలో బుధవారం సాయంత్రం టీడీపీ అభ్యర్థి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కార్యకర్తలు ఇళ్ల మధ్యలో బాణసంచా కాల్చడంతో చిన్న నరసింహులు అనే వ్యక్తికి చెందిన మల్బరీ షెడ్డుకు అంటుకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో ఆర్పే ప్రయత్నంలో ఒక యువకుడికి గాయాలయ్యాయి. షెడ్డు మొత్తం ఆహుతైంది.

ఏసీబీ కేసుతో ఇంటికి చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు


బాధిత రైతు మధుకర్‌రెడ్డికి చేరిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

కురబలకోట : ఏపీఎస్పీడీసీఎల్ కురబలకోట మండల విద్యుత్ శాఖ ఏఈ వెంకటరత్నం మంగళవారం లంచం తీసుకుంటూ కడప ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ సంఘటనలో బాధిత రైతులకు బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇంటికి చేరాయి. విద్యుత్ స్తంభాలు నాటి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసే పనులను సిబ్బంది చేపట్టారు. మండలంలోని చింతమాకులపల్లె సచివాలయ పరిధిలోని చింతపల్లెకు చెందిన రైతు సి. మధుకర్ రెడ్డి నుంచి రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రూ. 32 వేలు లంచం తీసుకుంటూ స్థానిక ఏఈ వెంకటరత్నం మంగళవారం ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఇది అంతటా కలకలం రేపింది. చర్చనీయాంశంగా కూడా మారింది. కురబలకోట మండలంలో ఐదేళ్లుగా ఆయన పనిచేస్తున్నారు. అంతేగాకుండా మండల చరిత్రలో ఏసీబీకి చిక్కిన తొలి అధికారిగా కూడా ఇతను మారాడు. మండలంలో 17 ఏళ్ల క్రితం కొండతూర్పు ఎగువపల్లెకు చెందిన దయ్యాల మద్దిరెడ్డి ద్వారా అప్పట్లో కురబలకోట వీఆర్‌ఓగా ఉన్న ప్రసాద్ తొలి సారిగా ఏసీబీకి పట్టుబడ్డాడు. చనిపోయిన తండ్రి ఆస్తిని కుమారుడి పేరుతో పాసుబుక్కు ఇవ్వడానికి అప్పట్లో వీఆర్‌ఓ రూ.10 వేలు డిమాండ్ చేశారు. రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆ తర్వాత సుదీర్ఘ కాలం తర్వాత ఇప్పుడు విద్యుత్ శాఖ ఏఈ ఏసీబీకి పట్టుబడ్డారు. కడప ఏసీబీ డీఎస్పీ గిరిధర్ ఇతనికి వైద్య పరీక్షలు నిర్వహింపజేసి బుధవారం నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరు పర్చారు. విచారించిన జడ్జి 14 రోజులు రిమాండుకు ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండు చేయడంతో పాటు వేధింపులకు గురి చేస్తే తమను సంప్రదించవచ్చని కడప ఏసీబీ డీఎస్పీ గిరిధర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


చంద్రశేఖర్

మదనపల్లె : మండలంలోని కొత్త ఇండ్లు రంగారెడ్డికాలనీకి చెందిన రామచంద్ర కుమారుడు బండి చంద్రశేఖర్(45) ఏప్రిల్ 29వతేదీ సాయంత్రం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు తాలూకా సీఐ 9440796742, ఎస్.ఐ 9440796743కు ఫోన్ చేయాలని తాలూకా సీఐ ఎం.శేఖర్ కోరారు.

వివాహిత మృతి కేసులో భర్త, అత్తమామలు అరెస్టు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని రామాంజనేయపురం సాగర్‌కాలనీలో నివాసం ఉంటున్న లతిక అలియాస్ లత (22) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటనలో మృతురాలి తండ్రి లక్ష్మినారాయణ తన కుమార్తెను, కట్టుకున్న భర్త, అత్తామామలే చంపేశారని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ కె. రామచంద్ర దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులైన మృతురాలి భర్త కుంచెం సాయి అలియాస్ సాయికుమార్ (26), అతని తల్లి కుంచెపు పద్మ అలియాస్ శాంతి, తండ్రి కుంచెపు లింగన్నలను బుధవారం కడప నగరం పాత బైపాస్ రోడ్డులో సీఐ కె. రామచంద్ర, తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు.

దొడ్ల డెయిరీలో మహిళ మృతి


లక్ష్మీదేవి(ఫైల్)

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మైదుకూరు -బద్వేలు జాతీయ రహదారి నందిపల్లె దగ్గర ఉన్న దొడ్ల డెయిరీలో బుధవారం రాత్రి విద్యుత్ షాక్‌తో ముడుమాల లక్ష్మీదేవి (40) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. మృతురాలు బద్వేలు పట్టణంలోని కృష్ణదేవరాయలు నగర్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. దొడ్ల డెయిరీ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

108 వాహనంలో ప్రసవం


తల్లి,పుట్టిన శిశువుతో 108 వాహనం ఈఎంటీ ప్రణతి

కమలాపురం : కమలాపురం మండల పరిధిలోని నసంతపురం గ్రామానికి చెందిన గొడ్డేటి విశ్వరూప అనే మహిళ 108 వాహనంలోనే ప్రసవించింది. మంగళవారం రాత్రి విశ్వరూపకు పురిటి నొప్పులు రావడంతో 108కు కాల్ చేశారు. ఎర్రగుంట్ల 108 వాహనం ద్వారా కమలాపురం సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమెకు నొప్పులు అధికం అయ్యాయి. దీంతో 108 సిబ్బంది ప్రణతి, బ్రహ్మయ్య వాహనంలోనే ప్రసవం చేశారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా ఆమె ఇది రెండో కాన్పు కాగా కుటుంబ సభ్యులు సీఎం జగనన్నకు, 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

152 మద్యం బాటిళ్లు, బైకు స్వాధీనం


మద్యం బాటిళ్లు, నిందితులతో ఎస్ఈబీ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న 152 ఆంధ్ర మద్యం బాటిళ్లు, బైకును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలతో, ఏఎస్పీ ఎస్ఈబీ సూచనల మేరకు అక్రమ మద్యం రవాణాదారులపై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో రాజుపాళెం మండలం పర్లపాడు గ్రామానికి చెందిన అచ్యుతుడు, శ్రీనివాసులు అనే ఇరువురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 152 ఆంధ్ర మద్యం బాటిళ్లు, మోటార్ బైకును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం సరఫరా చేసిన మద్యం దుకాణాల సేల్స్‌మెన్‌లను గుర్తించి వారిపై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడులలో ఎస్ఐ కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన

– ఇద్దరు టీడీపీ నాయకులపై కేసు నమోదు

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామ పంచాయతీలోని ఎస్.రామాపురం గ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా చైతన్యరెడ్డి తరపున ఆయన కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో టెంట్‌లు వేసి భోజనాలు ఏర్పాటు చేశారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, పోలీసులు చేరుకుని టెంట్‌లు, భోజన సామగ్రిని తీసివేయించారు. దీనికి కారణమైన అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, పిచ్చిరెడ్డిలపై పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేశారు.

సర్పంచ్‌పై తప్పుడు ఆరోపణలు తగదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ గంగులమ్మ, దళిత సంఘం నాయకులు

వాల్మీకిపురం : వాల్మీకిపురం పంచాయతీ సర్పంచ్ గంగులమ్మపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న చింతపర్తి సర్పంచ్ భర్త శేషాద్రిరెడ్డిపై దళిత సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సర్పంచ్ గంగులమ్మ, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి సుధాకర్ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాలన్నీ సర్పంచ్ గంగులమ్మ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నా ఆమెపై నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. టీడీపీ ప్రచార రథం దగ్ధమైన ఘటనపై తరిగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రమాణానికి రమ్మంటే టీడీపీ నాయకులు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. చింతపర్తి సర్పంచ్ మహిత అయితే కార్యాలయంలో ఆమె భర్త శేషాద్రిరెడ్డి కూర్చొని అధికారులను బెదిరించడం ఏంటన్నారు. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు బెంగళూరుకు ఇసుక అక్రమ రవాణా చేసింది ఎవరు.. టీడీపీ హయాంలో వాల్మీకిపురం పంచాయతీ కార్యాలయానికి నిప్పు పెట్టింది ఎవరు అని నిలదీశారు. నిరుపేదనంటూ మదనపల్లిలో ఇంటి పట్టా తీసుకోలేదా అన్నారు. మళ్లీ సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డిపై ఆరోపణలు చేస్తే చింతపర్తి పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు గాంధీపేట రఘు, అంజి, కుప్పస్వామి, వెంకటముని, ఆది, వేణుగోపాల్, ఎస్‌వి రమణ, వసంత, ప్రవీణ్, దిలీప్ కుమార్, మణి, యశ్వంత్, చిన్నోడు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీ ఆర్గాన్ డిస్ ఫంక్షన్ సిండ్రోమ్ చిన్నారికి పునర్జన్మ


విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ హుసేన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం బాలాజీ నగర్‌లోని కేఎస్‌హెచ్ పురిటి, చిన్న పిల్లల హాస్పిటల్‌లో మల్టీ ఆర్గాన్ డిస్ ఫంక్షన్ సిండ్రోమ్ (ఎంఓడీఎస్)తో ఉన్న పురిటి బిడ్డకు వైద్యులు పునర్జన్మను ప్రసాదించారు. వివాహమైన 15 సంవత్సరాలకు లేకలేక ఆడపిల్ల జన్మించిందని సంతోషించేలోపే శిశువు అవయవాలు పనిచేయడం లేదని తెలియడంతో ఆ దంపతులు విలవిల్లాడిపోయారు. చికిత్స అనంతరం నవజాత శిశువు ఆరోగ్యంగా ఉండడంతో వారి సంతోషానికి అవధులు లేవు. మైదుకూరుకు చెందిన దంపతులు రామకృష్ణ, రోజా, వైద్యులు డాక్టర్ కె.సుమియాతో కలిసి పురిటి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ హుస్సేన్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణ, రోజా దంపతుల బిడ్డకు అవయవాలు సక్రమంగా పనిచేయడం లేదని వైద్యులు తెలిపారన్నారు. వైద్యులు ఎవ్వరూ గ్యారంటీ ఇవ్వలేమని చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో వారు తమను సంప్రదించారని తెలిపారు. శిశువుకు ఆక్సిజన్ సక్రమంగా అందకపోవడంతో పాటు, ఫిట్స్ వస్తున్నట్లు గమనించామన్నారు. అలాగే కిడ్నీలు పాడై, ఊపిరితిత్తుల నుంచి రక్తం కారుతున్నట్లు గుర్తించామన్నారు. ఇది మల్టీ ఆర్గాన్ డిస్ ఫంక్షన్ సిండ్రోమ్ అనే వ్యాధి లక్షణమన్నారు. తమ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స అందించడంతో కోలుకుందన్నారు. వారు ఆస్పత్రికి వచ్చినప్పుడు శిశువు కేవలం 1200 గ్రాములు మాత్రమే బరువు ఉందన్నారు. 650 గ్రాములు బరువు పెరిగి ప్రస్తుతం 1850 గ్రాముల బరువు ఉందన్నారు. శిశువు ఆరోగ్యంగా ఉందని చెప్పారు. ఈ సమావేశంలో కేహెచ్‌ఎస్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పక్షపాత ఎన్నికలే ప్రజాస్వామ్యానికి ఊపిరి

– అరసం వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి

కడప కల్చరల్ : ప్రజాస్వామ్య మనుగడకు నిష్పక్షపాత ఎన్నికలే ఊపిరి అని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు, వైఎస్సార్ జిల్లా అరసం అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గ్రాండ్‌ఇన్ సమావేశ మందిరంలో అభ్యుదయ రచయితల సంఘం, ఇంటాక్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఎన్నికల భారతం' కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ఎన్నికలు జరగనున్న చారిత్రక సందర్భంలో అరసం ప్రజా చైతన్య కార్యక్రమాలను భుజానికి ఎత్తుకోవడం సామాజిక బాధ్యతను తీసుకున్నట్టుగా భావిస్తున్నామన్నారు. ఈ కవితా సంపుటి తప్పక ఓటర్లను మేల్కొల్పుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఇంటాక్ కడప జిల్లా కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ప్రలోభాలకు అతీతంగా జరగాలని, ఓటుకు అమ్ముడు పోతే మనకు గొర్రెలకు పెద్ద తేడా లేకుండా పోతుందని అన్నారు. సూర్య చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ప్రభాకర్ మాట్లాడుతూ అరసం ప్రజాపక్షం వహించి రచనలు చేయడం ఒక బాధ్యతగల అంశంగా పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాల స్థితిగతుల గురించి విశ్రాంత అధ్యాపకులు జోజిరెడ్డి ప్రస్తావించారు. అరసం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు మాట్లాడుతూ అరసం దేశంలో జరిగే ప్రతి ప్రజాస్వామిక సంఘటనను గమనిస్తోందని, ప్రజాపక్షం వహించి వాటికి అక్షర రూపం ఇస్తుందన్నారు. అందుకు ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం, మణిపూర్‌లో జరిగిన అణచివేత వంటి విషయాలను ఉదహరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గునిసెట్టి శ్రీనివాసులు, షేక్ హమీద్ ఫిరా, డాక్టర్ రంగనాథ రెడ్డి, న్యాయవాది భారవి, కొండూరు జనార్దన్‌రాజు, పి. చిట్టిబాబు, తాహిర్ తదితరులు పాల్గొన్నారు.